సాక్షి వికారాబాద్

సోమవారం, 6, నవంబర్, 2023



లోకల్ లొల్లి

లోకల్.. నాన్‌లోకల్ అనే పదం ప్రచారంలో ఎక్కువగా వినిపిస్తోంది. నేను లోకల్ నువ్వు నాన్ లోకల్ అంటున్నారు నేతలు. 10లో▸



మద్దతు కోసం మంతనాలు

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మంతనాలు జరిపారు. 10లో▸



మరోసారి అధికారం మాదే

ఆరవై ఏళ్లలో జరగని అభివృద్ధి, ప్రత్యేక తెలంగాణలో జరిగిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ అన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

మోడల్ పోలింగ్ కేంద్రం పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న లింగ్యానాయక్

కొడంగల్ రూరల్: కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం అడిషనల్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ పరిశీలించారు. పీఓ, ఏపీఓలకు, వికలాంగులకు, మహిళలకు, యూత్‌కు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ విజయ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'మెథడిస్టు' జాతర వాయిదా

ధారూరు: లక్షలాదిగా ఏసుక్రీస్తు భక్తులు తరలి వచ్చే ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతర తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రతి ఏడాదిలాగే నవంబర్ 14 నుంచి నిర్వహించే జాతరకు ప్రభుత్వపరంగా ఏర్పాట్లు చేయించాలని జిల్లా కలెక్టర్‌కు, బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీకి జాతర కమిటీ కార్యదర్శి దయానంద్ కోరారు. నవంబర్ 30న ఎన్నికలు జరుగుతున్నా దృష్ట్యా జాతరకు ఏర్పాట్లు గానీ, బందోబస్తు గానీ ఇవ్వడం సాధ్యం కాదని కలెక్టర్, ఎస్పీ వారికి తేల్చి చెప్పారు. దీంతో జాతరను డిసెంబర్ 5 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తామని జాతర కమిటీ తెలిపింది. ఏసు భక్తులు ఈ విషయాన్ని గమనించగలరని జాతర కమిటీ సభ్యులు తెలిపారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే కొప్పుల



గిరిజన మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ హయాంలోనే అన్నివర్గాలకు న్యాయం జరిగిందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని 4వ వార్డు న్యామత్‌నగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పథకం వెనుక సీఎం కేసీఆర్ కృషి ఎంతో ఉందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు మహ్మద్, కౌన్సిలర్లు రవీందర్, కిరణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి అధికారం ఖాయం

దోమ: రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని బుద్లాపూర్‌కి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే నివాసంలో ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ప్రజలు కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీ కళ్లబొల్లిమాటలను నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు పక్కా

కొడంగల్ రూరల్: టీపీసీసీ అధ్యక్షుడు, కొడంగల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం నామినేస్తారని.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కోరారు. ఆదివారం కొడంగల్‌లోని రేవంత్‌రెడ్డి నివాసంలో గురునాథ్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అబ్జర్వర్లు సెల్వరాజ్, విజయరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా కాంగ్రెస్ పార్టీకి భారీ మద్దతు లభిస్తుందని అన్నారు. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు యూసుఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, ఇందనూర్ సర్పంచ్ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ శంకర్‌నాయక్, ఎంపీటీసీ రాములు, నాయకులు పాల్గొన్నారు.



ధారూరు: ప్రచారంలో భాగంగా మేకపిల్లను ఎత్తుకున్న ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి సబిత

పతులకు కోసం సతులు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అధికార పార్టీ అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ప్రచారంలో క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్న అభ్యర్థులకు వారి సతీమణులు మద్దతుగా నిలుస్తున్నారు. మహిళా ఓటర్లను ఆకర్షించేదుకు వారు కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు. అక్క, చెల్లి, అమ్మ అంటూ ఆప్యాయంగా పలకరించి ఓటర్లను ఆకట్టుకునే పనిలో వారు నిమగ్నమయ్యారు. ధారూరు, కుల్కచర్ల మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి.. సతీమణులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. – సాక్షి, నెట్‌వర్క్



కుల్కచర్ల: ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి

ఉపాధి ఉత్తదే

నాలుగు నెలలుగా అందని డబ్బులు



- ఫీల్డ్ అసిస్టెంట్లపై కూలీల ఆగ్రహం
- జిల్లాలో రూ.5కోట్ల మేర బకాయిలు

వికారాబాద్ అర్బన్: గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. ప్రస్తుతం ఈ పథకం ద్వారా ప్రజలకు ఏమాత్రం ఉపాధి కల్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రజలకు సంవత్సరంలో 100 రోజుల పనిదినాలను కల్పించి ఉపాధి భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం 2005లో ప్రత్యేక చట్టాన్ని తీసుకువ్చింది. అయితే ఆ చట్టంలోని నిబంధనలు ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. దీంతో ఉపాధి పనులకు వచ్చేందుకు కూలీలు నిరాకరిస్తున్నారు. నాలుగు నెలల క్రితం చేసిన కూలీ డబ్బులే ఇప్పటివరకు రాకపోవడంతో వారు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఉపాధి హామీ పనుల కంటే అడ్డామీద కూలీ నయంగా భావిస్తున్నారు.

నాలుగు నెలలుగా అందని డబ్బులు..

సాధారణంగా గ్రామాల్లోని ఉపాధి కూలీలకు 15రోజుల్లో కూలీ డబ్బులు వారి ఖాతాల్లో జమచేస్తారు. ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల పనిదినాలను, చేసిన పనుల వివరాలతో మస్టర్లను సంబంధిత కార్యాలయంలో ప్రతివారం సమర్పిస్తారు. అనంతరం 15 రోజుల్లోపే కూలీల ఖాతాల్లో డబ్బు జమకావాలి. అయితే ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో పనిచేసిన కూలీలకు ఒక్కసారి కూడా డబ్బులు అందలేదు. దీంతో ఇళ్లు గడవడం కష్టంగా ఉందని కూలీలు వాపోతున్నారు. నాలుగు నెలలు దాటినా డబ్బులు రాకపోవడం ఏమిటని ఫీల్డ్ అసిస్టెంట్లపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబంధిత అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం ఒక్కో మండలానికి రూ.60 నుంచి రూ.70లక్షల బకాయి ఉండవచ్చనని సమాచారం.

జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు	
జాబ్ కార్డులు	1,82,497
ఉపాధి కూలీలు	2,52,127
100 రోజులు పూర్తిచేసుకున్న కార్డుదారులు	1,104
కూలీ డబ్బుల బకాయి	రూ.5,53,77,959

వంద రోజులు పూర్తిచేసుకున్నా అందని కూలీ..

వికారాబాద్‌లో జిల్లాలోని 18 మండలాల్లో 1,82,497 జాబ్‌కార్డులు ఉన్నాయి. సుమారు 2,52,127 మంది కూలీలు ఉన్నారు. వీరిలో 1,104 కుటుంబాలు 100 రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నారు. వీరిలో సుమారు 500మంది నాలుగు నెలల క్రితమే వంద రోజుల పని పూర్తిచేసుకున్నారు. వీరికి ఇప్పటివరకు నయా పైసా చేతికి అందలేదు. గ్రామంలో అందుబాటులో ఉండే ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగితే ఈరోజు, రేపు మీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని ఊరిస్తున్నారే తప్ప డబ్బులు మాత్రం జమకావడం లేదు. దీంతో ప్రస్తుతం ఉపాధి కూలీకి వచ్చేందుకు ఎవరూ ఇష్టపడటం లేదు. జిల్లావ్యాప్తంగా సుమారు రూ.5,53,77,959 కోట్లు బకాయిలు ఉన్నాయి.

క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి...

ఉపాధి డబ్బులు సకాలంలో చెల్లించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. లక్ష్య సాధనలో భాగంగా గ్రామంలోని జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100రోజుల పనిదినాలు కల్పించాలని పైఅధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లపై, టెక్నికల్ అసిస్టెంట్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. వారంవారం సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని తెలుసుకుంటున్నారు. అయితే గ్రామ స్థాయిలో కూలీలు పనులు చేసేందుకు నిరాకరిస్తున్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని.. లేదంటే వేతనాలు నిలిపివేస్తామని సంబంధిత అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లపై ఒత్తిడి తెస్తున్నారు. కూలీ డబ్బులు వస్తేనే పనులకు వస్తామంటూ ఓ వైపు కూలీలు, కూలీల సంఖ్య పెంచాలని మరోవైపు అధికారులు ఒత్తిడి చేస్తుండటంతో క్షేత్ర స్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్ల పరిస్థితి దారుణంగా మారింది. టార్గెట్లు పూర్తిచేయని సిబ్బందిపై సమావేశాల పేరుతో తీవ్రంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కూలీలకు అందని భృతి

ఉపాధి కూలీలు పనికోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపు పని కల్పించాలి. లేని పక్షంలో 15 శాతం నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంటుంది. పని చేశాక 15రోజుల్లో కూలీల ఖాతాల్లో డబ్బులు జమకాకపోయినా నిరుద్యోగ భృత్తి 25శాంత చెల్లించాల్సి ఉంటుంది. అయితే నాలుగు నెలలుగా కూలీ డబ్బులు అందకపోవడంతో వీరందరికి చట్టం ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉన్నా అధికారులు ఎక్కడా అమలు చేయడం లేదు.

కూలీ డబ్బులు రాలేదు



నాలుగు నెలల నుంచి ఉపాధి కూలీ డబ్బులు రాలేదు. ఇంట్లో ఉన్న వాళ్లందరమూ పనిచేశాం. కనీసం ఒకరికైనా డబ్బులు వస్తే ఇళ్లు గడుస్తుంది. ఏ ఒక్కరికీ డబ్బులు రాలేవు.. మేం ఎలా బతకాలి? అప్పుచేసి నిత్యావసర సరుకులు తెచ్చుకుంటున్నాం. ఉపాధి పనికి రావాలని రోజూ ఫీల్డ్ అసిస్టెంట్ ఇబ్బంది పెడుతున్నాడు.

– అంజయ్య, ఉపాధి కూలీ, మమదాన్‌పల్లి

వేరే పనులకు పోతున్నాం



రెండు, మూడేళ్లుగా ఉపాధి కూలీ డబ్బులు ఇచ్చేందుకు బాగా ఇబ్బంది పెడుతున్నారు. అంతకుముందు పదిహేను రోజులకు ఒకసారి డబ్బులు ఖాతాల్లో పడేవి. సకాలంలో డబ్బులు రాకపోవడంతో వేరే పనులకు పోవాల్సి వస్తుంది. నాలుగు నెలలుగా కూలీ రాకుంటే ఎంత ఇబ్బంది అవుతది. ఉన్నతాకారులు వెంటనే డబ్బులు ఇప్పించాలి.

– వెంకటయ్య, కద్పూర్ల

రెండు రోజుల్లో జమచేస్తాం

రెండు రోజుల్లో ఉపాధి కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. పెండిగ్ డబ్బులు రిలీజ్ అయినట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉంది. క్షేత్రస్థాయిలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతిరోజు పని డిమాండ్, కూలీల హాజరు, పని జరుగుతున్న ఫోటోలను స్పాట్ నుంచి మెసేజ్ చేయాలి. అలా చేయని వారిని ఖచ్చితంగా చేయమని ఆదేశాలిస్తే వేధిస్తున్నారని అంటున్నారు. ప్రతి ఉపాధి కూలీకి 100 రోజుల పనిదినాలు కల్పించాలన్నదే ప్రధాన ఉద్దేశం.

– కృష్ణన్, డీఆర్‌డీఓ

కాంగ్రెస్‌కి పట్టం కట్టండి



బషీరాబాద్: ప్రచార రంథంపై ప్రసంగిస్తున్న మనోహర్‌రెడ్డి

- ఆరు గ్యారంటీలపై తొలి సంతకం
- రోహిత్‌రెడ్డి నమ్మకద్రోహి
- తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి
- నియోజకవర్గంలో నేతల ముమ్మర ప్రచారం

బషీరాబాద్: మరో 25రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని.. డిసెంబర్ 9న రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణం చేస్తారని తాండూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బుయ్యు మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బషీరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పైలెట్ రోహిత్ రెడ్డిని గెలిపిస్తే రూ.వందల కోట్లు తీసుకొని బీఆర్‌ఎస్ పార్టీకి అమ్ముడుపోయాడని ఆరోపించారు. సీఎం కేసీఆర్ దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ బంధు పేరుతో ఆయా వర్గాలను మభ్య పెడుతున్నారని మండిపడ్డారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు విసిగిపోయి ఉన్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడానికి అన్నివర్గాలు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాయన్నారు. తనకు తాండూరుతో మూడు దశాబ్దాల అనుబంధం ఉందని.. తనను గెలిపిస్తే తాండూరును అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు.

కాంగ్రెస్ ప్రచారానికి స్పందన

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రచారానికి మంచి స్పందన కనిపించింది. తండాల్లో గిరిజన మహిళలు, యువకులు ఆ పార్టీలో చేరారు. నీళ్లపల్లిలో ప్రజలను మీటింగ్‌కు రాకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుకున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ రాకేశ్, కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్, పార్టీ మండల అధ్యక్షుడు శంకరప్ప, సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డి గెలుపును ఆపలేరు..

యాలాల: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్, సంగెంకుర్దు మాజీ సర్పంచ్ అంజిలయ్య తదితరులు తమ అనుచరుల(దాదాపు 200)తో కలిసి సునీతారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో మనోహర్‌రెడ్డికి యాలాల మండలం నుంచి భారీ మెజార్టీ లభించడం ఖాయమని తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతు, మహిపాల్ మాట్లాడుతూ.. అవినీతి బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డికి విజయానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, బీసీ సంఘం మండల అధ్యక్షుడు అమృతయ్య, నాయకులు ఉన్నారు.



భోజ్యానాయక్ తండాలో నిర్వహించిన ర్యాలీలో గిరిజనలు

సీఎం కాదు.. అటెండర్ కూడా కాలేడు

- రేవంత్‌రెడ్డిపై నరేందర్‌రెడ్డి ఫైర్
- అందుబాటులో ఉంటా ఆశీర్వదించాలని ఓటర్లకు విజ్ఞప్తి

బొంరాస్‌పేట: 'సీఎం కాదు.. సీఎం ఆఫీసులో అటెండరు కాలేడు' అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని రేగడిమైలారం, లింగన్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, కొత్తూరులో నరేందర్‌రెడ్డి పర్యటించారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ..గాలి(హెలికాప్టర్)లో తిరిగే రేవంత్ నాయకుడా.. ప్రజల మధ్య ఉండే నేను నాయకుడినా.. ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. సీఎం కేసీఆర్ రూపొందించిన పథకాలన్నీ ఢిల్లీలో ఆపేసి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఇవ్వడం లేదని తమ పార్టీపై విమర్శలు చేయడం సరికాదని నరేందర్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తల కుటుంబాలకు బీమా చేయిస్తున్నామన్నారు. మరో 500ల దళితబంధు యూనిట్లు మంజూరయ్యాయని, గొర్రెల యూనిట్లు సైతం ఎన్నికల అనంతరం అందుతాయని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు.. నారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, దేశ్యానాయక్, యాదగిరి, రాంనాయక్, గోవింద్‌రెడ్డి, శ్యామలయ్యగౌడ్ బలిజశేఖర్ తదితరులున్నారు.

కొడంగల్‌లో ముమ్మర ప్రచారం..

కొడంగల్ రూరల్: సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని కొడంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. అభివృద్ధికి పట్టం కట్టాలని ఓటర్లను కోరారు. ఇప్పటివరకు చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ముందుకు సాగారు. అంగడిరాయిచూర్‌లోని పలు కాలనీవాసులతో ముచ్చటిస్తూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆప్యాయంగా మాట్లాడారు. ప్రజానాయకులను ఓడించడానికి కాంగ్రెస్ దొరలు, దొంగలు ఏకమయ్యారని విమర్శించారు. అభివృద్ధికి పట్టం కట్టాలని.. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఇప్పటివరకు చేసిన అభివృద్ధి పనులను వివరించారు. సంక్షేమ పథకాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి నియోజకవర్గంలో భంగపాటు తప్పదన్నారు. రేవంత్‌రెడ్డిని ఓడించి తీరుతామన్నారు. నాయకులంతా కలసికట్టుగా పనిచేసి బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి అధికారంలో వచ్చేలా చేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: ప్రచారంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కారు.. హుషారు

ఆమనగల్లులో ఆశీర్వాద సభ

- షాద్‌నగర్‌లో రోడ్ షో
- కదిలిన గులాబీ దండు
- భారీగా తరలి వచ్చిన జనం
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్

ఆమనగల్లు/షాద్‌నగర్: బీఆర్‌ఎస్ ఆదివారం ఆమనగల్లు, షాద్‌నగర్‌లో నిర్వహించిన ఆశీర్వాద సభ, రోడ్‌షోలతో పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. రోడ్లన్నీ గులాజీ జెండాల రెపరెపలతో సందడిగా కనిపించాయి. ఆమనగల్లులోని జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆదివారం రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో సభ విజయవంతమైంది.

ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు హామీ

ఆమనగల్లులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. సభలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కల్వకుర్తిలోని రఘుపతిపేట, వెల్జాల, గట్టుప్పలపల్లి గ్రామాలను మండలాలుగా చేయాలని, ఆమనగల్లులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. స్పందించిన మంత్రి కల్వకుర్తి నుంచి జైపాల్‌యాదవ్‌ను గెలిపిస్తే కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేయడంతో పాటు ఆమనగల్లులో ఆర్డీఓ కార్యాలయం, ఇతర డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ కోరారు. బీఆర్‌ఎస్ ద్వారా ఎమ్మెల్సీ పదవి పొంది పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. సభలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వెంకటేశ్, జెడ్పీటీసీ సభ్యులు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, ఎంపీపీ నిర్మల, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: కేటీఆర్‌కు మేకపిల్లను బహూకరిస్తున్న నాయకులు

కిక్కిరిసిన షాద్‌నగర్

షాద్‌నగర్‌లో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు కొత్తూరు, కొందుర్గు, నందిగామ, చౌదరిగూడ, కేశంపేట, ఫరూఖ్‌నగర్‌తో పాటు పట్టణంలోని అన్ని వార్డుల నుంచి జనం భారీగా తరలివచ్చారు. షాద్‌నగర్ చౌరస్తా కిక్కిరిసిపోయింది. రోడ్‌షో సందర్భంగా పట్టణ చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన డీజే పాటలు అలరించాయి. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. మంత్రి కేటీఆర్ చేసిన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. ఇరవై నిమిషాల పాటు మంత్రి చేసిన ప్రసంగంలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి గురించి మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ నేతల తీరుపై విరుచుకపడ్డారు. ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం నేతృత్వంలో పటిష్ట బందోబస్తును నిర్వహించారు.



ఆమనగల్లు: ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



బషీరాబాద్: కాంగ్రెస్ జెండాలు, కండువాలతో అభిమాని



కుల్కచర్ల: వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి



దౌల్తాబాద్: రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువత



దౌల్తాబాద్: గుముడాలలో నరేందర్‌రెడ్డి తనయుడి ప్రచారం



కొడంగల్ రూరల్: అంగడిరాయిచూర్‌లో వృద్ధుడిని పలకరిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

ఓట్ల వేట

జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌లు నువ్వా నేనా అన్నవిధంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు దూసుకుపోతున్నారు. అభ్యర్థులతో పాటుగా కుటుంబ సభ్యులు సైతం ఓట్ల వేటలో నిమగ్నమయ్యారు. - వికారాబాద్ నెట్‌వర్క్

లోకల్ లొల్లి

ప్రచారంలో ఇదే ప్రధానాస్త్రం

- వికారాబాద్, తాండూరు సెగ్మెంట్‌లలో తీవ్రం
- కొడంగల్ బరిలో వలస పక్షులు
- వేడెక్కుతున్న ఎన్నికల వాతావరణం



> ఎన్నికల వేళ లోకల్.. నాన్ లోకల్ అంశంపై జిల్లా వ్యాప్తంగా చిచ్చు రేపుతోంది. వికారాబాద్, తాండూరులో ఈ విమర్శనాస్త్రాలు అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు జిల్లా వ్యాప్తంగా టికెట్లు ప్రకటించగా బీజేపీ ఇంకా మూడు స్థానాలు పెండింగ్‌లో ఉన్నాయి. వారు సైతం సీట్లు కేటాయిస్తే స్థానికత అంశం ఎంత రచ్చ చేస్తుందో చూడాలి

వికారాబాద్ : లోకల్.. నాన్‌లోకల్ .. జిల్లాలో ఈ పదం ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువగా వినిపిస్తోంది. నువ్వు నాన్ లోకల్ అంటూ ఓ అభ్యర్థి విమర్శనాస్త్రాలు గుప్పిస్తే మరొకరు లోకల్‌కు అర్థం తెలుసుకో.. రాజ్యాంగం చదువుకో అంటూ మరొకరు ప్రతి విమర్శలు చేస్తున్నారు. బీజేపీని మినహాయిస్తే రెండు ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో పూర్తి స్థాయి ప్రచారంలో దూసుకుపోతున్నారు. అభ్యర్థులు, నేతలు, పార్టీల మాటల యుద్ధంతో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మున్సిపల్ కేంద్రాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామాల వరకు ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. నాన్‌లోకల్ అనే అస్త్రాన్ని వికారాబాద్ సెగ్మెంట్‌లో బీఆర్ ఎస్ అధ్యక్షుడు మెతుకు ఆనంద్, తాండూరులో పైలెట్ రోహిత్‌రెడ్డి తమ ప్రత్యర్థులపై ఎక్కువగా ప్రయోగిస్తున్నారు. వికారాబాద్‌లో నువ్వు నాన్‌లోకల్ అని ప్రసాద్‌కుమార్‌ను ఆనంద్ విమర్శించగా.. ఎమ్మెల్యేకు చట్టం తెలియదనుకుంటా.. రాజ్యాంగం చదవండి స్థానికతపై అవగాహన వస్తుందని ఆయన ప్రతి ఘటించారు. ఈ అస్త్రాన్ని పక్క పార్టీలు అధికార బీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డిపై ఎక్కుపెడు తూ.. మంత్రి మహేందర్‌రెడ్డి తాండూరులో, చేవెళ్ల నియోజకవర్గంలో ఎంపీ లోకల్ అవుతారా..? అంటూ తిప్పికొడుతున్నారు.

నియోజకవర్గాల్లో ఇదీ పరిస్థితి

జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు సగం లోకల్ సగం నాన్‌లోకల్ అన్న చందంగా టికెట్లు కేటాయించాయి. పరిగి నియోజకవర్గంలో బీఆర్ఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న కొప్పుల మహేశ్‌రెడ్డి, తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి ఇద్దరు స్థానికులే. బీజేపీ ప్రకటించిన బూనేటి మారుతికిరణ్ పక్క జిల్లా శంషాబాద్ వాసి. వికారాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి స్థానికుడు కాగా కాంగ్రెస్ అభ్యర్థి స్థానికేతరుడు. ఇతనికి ఓటు హక్కు మాత్రం ఎంతో కాలంగా ఇక్కడే ఉంది. తాండూరులో అధికార పార్టీ నుంచి పోటీ చేస్తున్న రోహిత్ రెడ్డి స్థానిక నియోజకవర్గ వాసి. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న బుయ్యని మనోహర్‌రెడ్డి పక్కని యోజకవర్గానికి చెందిన వ్యక్తి. అయితే ఇతనికి తాండూరులో ఇల్లు, ఓటు హక్కు ఉన్నాయి. బీజేపీ అభ్యర్థిత్వం పెండిగ్‌లో ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో జన్మస్థలం పరంగా ఇద్దరూ స్థానికేతరులే. ఈ స్థానం నుంచి రేవంత్‌రెడ్డి నాలుగోసారి బరిలో నిలుస్తున్నారు. ఈయన ఓటు హక్కు, ఇల్లు కొడంగల్‌లోనే ఉన్నాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి రెండో సారి పోటీ చేస్తున్నారు. ఆయన ఓటుహక్కు నియోజకవర్గ పరిధిలోనే ఉంది.

చట్టం ఏం చెబుతుంది..?

సాధారణంగా పుట్టిన గ్రామం.. నివాసం ఉంటున్న స్థలం చూసి ఇచ్చే నివాసం సర్టిఫికెట్ ఆధారంగా స్థానికతను గుర్తిస్తారు. పోటీ చేసే అభ్యర్థుల విషయంలో మాత్రం రాజ్యాంగం స్థానికతకు విస్తృత అవకాశం కల్పించింది. వార్డు సభ్యుడిగా , సర్పంచ్‌గా పోటీ చేసే వ్యక్తి తప్పనిసరిగా ఆ గ్రామానికి చెందిన వ్యక్తి అయి ఉండాలి. ఇక ఎంపీటీసీ సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తి ఆ మండలానికి చెందిన వారై ఉండాలి. జెడ్పీటీసీ సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తి జిల్లాకు చెందినవారై ఉండాలి. ఎమ్మెల్యేగా పోటీ చేసే వ్యక్తి ఆ రాష్ట్రానికి చెందినవాడైతే చాలు ఎక్కడి నుంచి అయిన పోటీ చేయవచ్చు. ఎంపీగా పోటీ చేసే వ్యక్తి దేశంలో ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి అయినా సరే ఏ ప్రాంతం నుంచి అయినా పోటీ చేయవచ్చు. పోటీ చేసే ప్రాంతంలో అతనికి ఓటు హక్కుంటేనే అర్హుడిగా గుర్తిస్తారు.

మహేశ్వరం.. రసవత్తరం

> గ్రామీణం, పట్టణం, నగరం మూడు ప్రాంతాలు కలిసి ఉండే ప్రాంతం మహేశ్వరం నియోజకవర్గం. 2009లో ఏర్పడిన ఈ సెగ్మెంట్‌లో మహేశ్వరం, కందుకూరు మండలం, తుక్కుగూడ మున్సిపాలిటీతో పాటుగా జీహెచ్‌ఎంసీలోని సరూర్‌నగర్ ప్రాంతం ఇందులోనే ఉంటుంది. ఇప్పటికి మూడు మార్లు ఎన్నికలు జరగ్గా రెండు సార్లు కాంగ్రెస్‌కు, ఒకసారికి 'కారు'కు ఇక్కడి ప్రజలు పట్టం కట్టారు.

- దేశంలోనే తొలి మహిళా హోంమంత్రిని ఇచ్చిన సెగ్మెంట్‌గా రికార్డు
- రాష్ట్రంలో మొదటి మహిళా మంత్రి ఇక్కడి నుంచే..
- 'కారు'కు 'కమలం'కు దక్కని అవకాశం
- పక్క నియోజకవర్గం నుంచి వచ్చి ప్రత్యర్థులుగా మారిన సబిత, కేఎల్ఆర్





పటోళ్ల సబితారెడ్డి



తీగల కృష్ణారెడ్డి



అందెల శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: దేశంలోనే తొలి మహిళా హోంమంత్రిని అందించిన ఈ నియోజకవర్గం చరిత్రకెక్కింది. విభిన్న జాతులు, వర్గాలు, ప్రాంతాల మిళితం ఈ సెగ్మెంట్. ఇక్కడ హస్తం గుర్తుపై గెలుపొందిన సబితారెడ్డి రాజశేఖర్‌రెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు. 2018 విజయం తర్వాత కాంగ్రెస్‌ను వీడి కారెక్కింది. దీంతో ఆమెకు సీఎం కేసీఆర్ తన మంత్రి వర్గంలో బెర్తు కల్పించారు. దీంతో ఆమె తెలంగాణలోనూ తొలి మహిళా మంత్రిగా రికార్డు సృష్టించారు. నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, మైనార్టీల ఓట్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తుంటాయి.

ఫ్యాబ్‌సిటీ ఏర్పాటుతో పెరిగిన ఓటర్లు

నియోజకవర్గంలో ఫ్యాబ్ సిటీ(ఈ–సిటీ), హార్డ్‌వేర్ పార్కు, కందుకూరులో ఫార్మాసిటీ, మహేశ్వరంలో ఎలక్ట్రానిక్ పార్కులో భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఈ పరిశ్రమలు ఉండడంతో దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఫ్యాబ్‌సిటీ(ఈ–సీటీ)లో పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. స్థానికేతరులు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో ఓట్లు భారీగా నమోదయ్యాయి. నియోజకవర్గాన్ని మినీ భారత్‌గా పిలుస్తారు.

జనరల్ స్థానంగా

2009 సంవత్సరంలో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకు జనరల్ స్థానంగా ఉంది. మహేశ్వరం, కందుకూరు మండలాలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలో ఉండేవి. బాలాపూర్, సరూర్‌నగర్ రెండు అర్బన్ మండలాలు మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలో ఉండేవి. డీలిమిటేషన్‌తో మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, సరూర్‌నగర్ మండలాలను కలుపుతూ మహేశ్వరం నియోజకవర్గం ఏర్పాటైంది.

పట్టు సాధిస్తున్న పటోళ్ల

మహేశ్వరం నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి మూడు సార్లు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ నుంచి సబితారెడ్డి రెండుసార్లు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి(టీకేఆర్) టీడీపీ నుంచి ఒక సారి గెలుపొందారు. చెవెళ్ల నుంచి వచ్చి మహేశ్వరంలో పోటీ చేసి రెండు పర్యాయాలు గెలుపొందిన సబితారెడ్డి నియోజకవర్గవాసుల ఆత్మభిమానం చూరగొన్నారు. నియోజకవర్గంలో ఆమెకు వ్యక్తిగతంగా బలమైన కేడర్‌ను తయారు చేసుకుంది. 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉన్నారు.

త్రిముఖ పోరు

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి సబితాఇంద్రారెడ్డి, కాంగ్రెస్ నుండి కిచ్చనగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్), బీజేపీ నుంచి అందెల శ్రీరాములు యాదవ్‌లు పోటీ చేస్తున్నారు. మూడు ప్రధాన పార్టీలకు నియోజకవర్గంలో బలమైన ఓటు బ్యాంకు ఉంది. నియోజకవర్గంలో ఈ సారి బీర్‌ఎస్‌ను బోణీ కొట్టి స్తాననే ధీమాతో మంత్రి సబితారెడ్డి ముందుకు వెళ్తున్నారు. మరోసారి మా కంచుకోటపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడిస్తామని కేఎల్ఆర్ గట్టి నమ్మకంతో పనిచేస్తున్నారు. సానుభూతితోపాటుగా బలమైన కేడర్ ఉండడం కమలానికి కలిసి వస్తుందని అందెల శ్రీరాములు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ఈ ఎన్నికలో నియోజకవర్గంలో త్రిముఖ పోరు తప్పదని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

నియోజకవర్గ ఏర్పాటు నుంచి ఎన్నికల వివరాలు

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
2009	సబితారెడ్డి	కాంగ్రెస్	తీగల కృష్ణారెడ్డి	టీడీపీ	7,833
2014	టీకేఆర్	టీడీపీ	మల్‌రెడ్డి రంగారెడ్డి	కాంగ్రెస్	30,786
2018	సబితారెడ్డి	కాంగ్రెస్	టీకేఆర్	టీఆర్‌ఎస్	9,227

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహేశ్వరం	72	33156	31790	7	64,953
కందుకూరు	61	25550	24689	1	50,240
బాలాపూర్	245	153074	14474	56	2,97,884
సరూర్‌నగర్	133	64492	59095	3	1,23,590
మొత్తం	511	2,76,272	2,60,328	67	5,36,667

'హస్తం' నిరీక్షణ ఫలించేనా..?

- 'పట్నం'పై నలభై ఏళ్లుగా ఎగరని కాంగ్రెస్ జెండా
- ఆధిపత్యం చూపిన టీడీపీ, సీపీఎంలు

> గ్రేటర్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ రాజకీయం ప్రతీ ఎన్నికలో రసవత్తరంగానే ఉంటోంది. టికెట్ రేసులో ఉండి ఎన్నికల వరకు పార్టీ కేడర్ కాపాడుతూ వస్తున్న నేతలకు ఆ పార్టీ మిత్రపక్షాలకు టికెట్ వదిలేసి నమ్మిన వారికి మొండి చేయి చూపుతోంది. 2023లో పార్టీ అభ్యర్థికే టికెట్ కేటాయించారు. దీంతో పట్నంపై హస్తం విజయపతాకం ఎగరేసేనా అన్న చర్చ మొదలైంది.



తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 40 ఏళ్ల కాంగ్రెస్ నిరీక్షణకు తెరపడనుందా..? ఇన్నేళ్లుగా ఇక్కడ నుంచి హస్తం గుర్తుపై గెలిచిన శాసన సభ్యుడు లేక నిరాశలో ఉన్న పార్టీ శ్రేణులుకు ఊరట దక్కనుందా అనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతోంది. 1983 ఎన్నికల్లో ఏజీ కృష్ణ అనంతరం ఆ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహించే వారు లేక కాంగ్రెస్ శ్రేణులు డీలా పడ్డాయి. 2004లో వైఎస్సార్ హయాంలోనూ టికెట్‌ను మిత్రపక్షాలైన సీపీఎంకు కేటాయించడంతో నియోజకవర్గంలో ఎర్రజెండా ఎగురవేసింది. నియోజకవర్గం ఏర్పాటు నుంచి 16 ఎన్నికలు జరగ్గా.. 1952 నుంచి 1983 వరకు వరుసగా ఎనిమిది సార్లు హస్తగతం చేసుకుంది.

సైకిల్‌పై ముగ్గురు అసెంబ్లీకి

1983లో టీడీపీ స్థాపన తర్వాత సైకిల్ హవా కొనసాగింది. 1985 ఎన్నికల్లో కె.సత్యనారాయణ టీడీపీ నుంచి గెలుపొందారు. అనంతరం 1999లో కొండ్రు పుష్పలీల, 2009, 14 ఎన్నికల్లో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి టీడీపీ నుంచి గెలుపొంది శాసనసభకు వెళ్లారు. తెలంగాణ ఉద్యమ ప్రభావం కారణంగా టీడీపీ ప్రాబల్యం తగ్గడంతో మంచిరెడ్డి సైకిల్ దిగి కారెక్కారు. 2018లో టీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది హాట్రిక్ విజయం తన ఖాతాలో వేసుకున్నారు.

ఎర్రజెండా రెపరెపలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కమ్యూనిస్టులకు మొదటి నుంచి మంచి పట్టు ఉంది. 1989, 1994లో టీడీపీతో పొత్తులో భాగంగా 'పట్నం' సీటును రెండు పర్యాయాలు సీపీఎంకే ఇవ్వడంతో కొండిగారి రాములు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో కొండిగారి రాములు ఏ పార్టీతో పొత్తు లేకుండా పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆ తరువాత 2004లో కాంగ్రెస్ పార్టీతో పొత్తులో భాగంగా మస్కు నరసింహ సీపీఎం తరుపున పోటీ చేసి గెలుపొందడంతో మొత్తం మూడు సార్లు నియోజకవర్గంలో ఎర్ర జెండా రెపరెపలాడింది.

గెలుపు వరించేనా..?

2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 9,216 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014లో ఆ పార్టీ క్యామ మల్లేశ్‌కు టికెట్ కేటాయించడంతో మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డి ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచారు. దీంతో హస్తం పార్టీకి ఓటమి తప్పలేదు. 2018లో మహాకూటమి పొత్తులో భాగంగా టీడీపీకి టికెట్‌ను కేటాయించడంతో సామ రంగారెడ్డి బరిలో నిలిచారు. బీఎస్పీ తరుపున పోటీచేసిన మల్‌రెడ్డి రంగారెడ్డికి కాంగ్రెస్ బహిరంగంగానే మద్దతు తెలిపిన స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. ప్రతీ సారి గెలుపు హస్తం పార్టీ నాయకులను దోబూచులాడుతుండటంతో ఈ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డిని వరిస్తుందా లేదా అన్నది తేలడానికి డిసెంబర్ 3 వరకు ఆగాల్సిందేనని నియోజకవర్గ నేతలు చర్చించుకుంటున్నారు.



ఆమనగల్లు: కేటీఆర్ సమక్షంలో చేరికలు



'గులాబీల జెండలే రామక్క..' పాటపాడుతున్న మహిళలు

కారు.. జోరు

- ప్రజా ఆశీర్వాద సభ, రోడ్‌షో సక్సెస్
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్

ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ, షాద్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విచ్చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నేతలు ఆయన సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి స్వాగతించారు. రోడ్‌షోకు వచ్చిన జనం కేటీఆర్‌కు నీరాజనాలు పలికారు. ఆశీర్వాద సభ, రోడ్‌షో సక్సెస్‌తో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కొత్త జోష్ నింపింది. - ఆమనగల్లు/షాద్‌నగర్



షాద్‌నగర్: రోడ్‌షోలో గులాబీ జెండాలతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు



రోడ్‌షోకు తరలి వెళ్తున్న పార్టీ శ్రేణులు